క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భూత్పూర్: మండలంలోని కర్వెన, కొత్త మొల్గర సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మెత్యుశల ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు, సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు తాటికొండలో కల్యాణోత్సవం



భూత్పూర్: మండలంలోని తాటికొండలో మంగళవారం భూదేవి సమేత లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమ పండితులు తాళ్లపాక మణికంఠ శివాచార్య వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున నరసింహ హోమం, ఉదయం 8 గంటలకు తిరుమంజన సేవ, 11 గంటలకు స్వాతి నక్షత్ర శుభ లగ్న పుష్కరాంశ సుమూహూర్తాన కల్యాణోత్సవం ఉంటుందని వారు తెలిపారు. స్వామి వారి తీర్థప్రసాదాలు అన్నప్రసాదం స్వీకరించాలని, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

నేడు కల్యాణోత్సవం..

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో బీసీ కాలనీలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు గోపాల్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం 1995–96 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో వెంకటన్న, రాఘవ రెడ్డి, సిద్దేశ్వర్, నజీర్ హమ్మద్, బత్తుల బాల్‌రాజు, భాస్కర్, రాములు, భగవాన్, నర్సింహులు, శ్రీనివాసులు, కురుమూర్తి, ధర్మారెడ్డి, మంజుభార్గవి, మంజుల పలువురు పాల్గొన్నారు.

రైసీ ఇబ్రహీం మృతి తీరని లోటు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇరాన్ అధ్యక్షుడు రైసీ ఇబ్రహీం మృతి ప్రపంచ సమాజానికి తీరని లోటని ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మేధావుల్లో ఆయన ఒకరని అలాంటివ్యక్తి అకాల మరణం తమను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తు ఆయన సంతాపంలో ప్రపంచ ప్రజలందరు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు.

పనుల పరిశీలన



బాలానగర్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల మౌలిక సదుపాయల పనులను ఎంపీడీఓ శరత్ చంద్ర బాబు పరిశీలించారు. సోమవారం మండలంలోని వీరన్నపల్లి, వీరన్నపల్లి తండా, జాలుగడ్డ తండాలలోని పాఠశాలలో పనులను ఎంపీడీఓ పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడవద్దని కాంట్రాక్టర్లకు సూచించారు.

వైద్య శిబిరం



మిడ్జిల్: మండల కేంద్రంలో పశువైద్య కేంద్రం సమీపంలోని కాలనీలో చికెన్ గున్యాతో చాలా మంది కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధ పడుతుండడంతో ఆ ప్రాంతంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న 13 మంది రక్త సేకరణ చేసి, వాటిని మహబూబ్‌నగర్ ఐడీఎస్‌పీకి పంపించడం జరిగిందని తెలిపారు. 25 మంది జ్వరంతో బాధపడుతుండడంతో వారికి మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఎవరూ కలత చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వైద్య సిబ్బంది శివకుమార్, మహేందర్, దేవయ్య, గీత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జడ్చర్లలో భారీ వర్షం



క్రాస్ రోడ్డు వద్ద నిలిచిన వర్షపునీరు



చైతన్యనగర్‌లో ఇంట్లోకి వచ్చిన వరద నీటిని బయటకు పారబోస్తున్న వ్యక్తి

- విరిగి పడిన చెట్లు
- నేలకూలిన ఫ్లెక్సీలు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: పట్టణంలో సోమవారం సయాంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉన్న ఆకాశం మధ్యాహ్నానికి మండుటెండతో ఉక్కపోతకు గురిచేసింది. సాయంత్రం 4గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులు వీయటంతోపాటు భారీ వర్షం కురిసింది. దీంతో మున్సిపాలిటీలోని పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలపై కొమ్మలు పడ్డాయి. అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ పడటంతోపాటు విద్యుత్ స్తంభం ఒరిగింది. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. 167వ నంబరు జాతీయ రహదారిపై శ్రీనివాస థియేటర్ సమీపంలో ఒక వైపు వర్షపునీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే విధంగా క్రాస్‌రోడ్డు వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద సైతం వర్షపునీరు నిలిచి వాహనదారులు అవస్థలు పడ్డారు. నల్లగుంట నుంచి వచ్చే వరద నీరు మరోసారి పట్టణంలోని ప్రధాన రోడ్డును జలమయంగా మార్చింది. ఇలా పట్టణంలోని పలుచోట్ల ప్రజలు అవస్థలు పడ్డారు. చైతన్యనగర్ కాలనీలో కొందరి ఇళ్లల్లోకి నీరు చేరింది. క్రాస్ రోడ్డు వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ సమస్య నెలకొంది.

నిలిచిన విద్యుత్ సరఫరా

వర్షం కారణంగా పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మహబూబ్‌నగర్ నుంచి బాదేపల్లి సబ్‌స్టేషన్‌కు వచ్చే సరఫరా నిలిచిపోవటంతో పట్టణంతో పాటు బూర్గుపల్లి, కిష్టంపల్లి, ఆలూరు గ్రామాల్లోనూ కరెంట్ సరఫరా ఆగిపోయింది. పోలేపల్లి నుంచి జడ్చర్ల సబ్‌స్టేషన్‌కు వచ్చే సరఫరా నిలిచిపోవటంతో పట్టణంలో విద్యుత్ ఆగిపోయింది. విద్యుత్ సిబ్బంది స్తంభాల వెంట తిరిగి చెట్లకొమ్మలు తొలగించారు. రాత్రి 8గంటలకు కొద్దిసేపు సరఫరా పునరుద్ధరించినప్పటికి సబ్‌స్టేషన్‌లో ట్రిప్ కావటంతో మళ్లీ నిలిచిపోయింది. వర్షం వచ్చిన ప్రతిసారి విద్యుత్ సమస్య తలెత్తటంపై పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కాలం చెల్లిన వాహనాలతో వాయుకాలుష్యం



మండలంలో తీవ్ర పొగను వెదజలుతూ వెళ్తున్న వాహనం

బాలానగర్: కాలం చెల్లిన భారీ వాహనాలు తీవ్ర వాయు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. మండలంలోని పలు పరిశ్రమలకు వచ్చి పోయే పలు వాహనాలు పొగను వెదజల్లుతూ రోడ్లపై తిరుగున్నాయి. అయినా ఏ అధికారి కూడా ఇలాంటి వాహనాలపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని మండల ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి కాలం చెల్లిన వాహనాలపై ఆర్‌టీఏ అధికారులు జరిమానా విధించకపోవడంపై, కాలుష్యాన్ని కంట్రోల్ చేయకపోవడంపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఉదాసీనత వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. వాహన రిజిస్ట్రేషన్ సమయం నుంచి 15ఏళ్ల కాల పరిమితితో వాహనాలు రోడ్లపై తిరిగేందుకు ఆర్‌టీఓ అధికారులు అనుమతులతో వస్తాయి. కానీ వాహనాల ఫిట్‌నెస్ పూర్తయ్యి, ఇన్సూరెన్స్ లేకుండా, తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతూ రోడ్లపై భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నా అలాంటి వాహనాల కాలుష్యాన్ని కట్టడి చేయడంలో అధికారులు అలసత్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

పాఠశాలల పరిశీలన



హన్వాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని పెద్దదర్పల్లి, పుల్పోనిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులన్నీ పూర్తి చేసి సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ యశోదమ్మ, ఎంఈఓ రాజునాయక్, సీఆర్‌పి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: మండలంలోని వివిధ పాఠశాలల్లో అభివృద్ధి పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవన్న సోమవారం పరిశీలించారు. అంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- మాగనూర్‌లో వెలిసిన లక్ష్మీనారసింహస్వామి
- 21 నుంచి 25వ తేదీ వరకు కొనసాగింపు
- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తుల రాక



స్వామి వారి ప్రధాన ఆలయం

మాగనూర్: మాగనూర్‌లో తూర్పు వాగు కలిగి పచ్చని పంట పొలాల నడుమన.. ఆహ్లాదకరమైన వాతావరణంలో వైకుంఠ వాసుడు శ్రీ లక్ష్మీనారసింహస్వామి, లక్ష్మీదేవి, చెంచులక్ష్మి అమ్మవారి సమ్మేతంగా ఇక్కడ ప్రతిష్టింపబడ్డాడు. జిల్లాలో ప్రసిద్ధి చెందినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

మాగనూర్‌లో వెలిసిన వైకుంఠ వాసుడు శ్రీలక్ష్మీనారసింహస్వామిని దర్శించుకున్న భక్తులకు కోరిన కోర్కెలు తీర్చి, అడిగిందల్లా ప్రసాదించే ఆపద్బాంధవుడిగా ప్రత్యక్షమవుతున్నారని అపార నమ్మకం ఇక్కడి ప్రజల్లో నాటుకుంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారు స్వామిని దర్శించుకున్నా.. విముక్తి కలుగుతుందని ప్రత్యేక్షంగా అనుభవం పొందిన భక్తుల విశ్వాసం. స్వామి వారి కటాక్షంతో వ్యాపారం వృద్ధి చెంది, ఉన్నత చదువులు అభ్యసించిన అనేక మంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తుంటారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న పల్లకీసేవ, శ్రీనారసింహ స్వామి జయంతి జాతర ప్రారంభం, 22న గంధలేపనం, హోమం, 23న ఉదయం 5.30 నిమిషాలకు ప్రభోత్సవం, ఉదయం 9.45 నిమిషాలకు స్వామివారి కల్యాణోత్సవం, గండ జ్యోతులు, రాత్రి 9 గంటలకు రెట్టపట్లు, 24న తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, సాయంత్రం 5 గంటలకు పాలఉట్లు, 25న ఉదయం 10 గంటలకు గరుడవాహన సేవ, సాయంత్రం శేషవాహన సేవ, హనుమాన్ వాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

మాగనూర్‌లో వెలిసిన లక్ష్మీనారసింహస్వామి బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలి. స్వామివారి కల్యాణం, హోమంతో పాటు ప్రత్యేక పూజల్లో పాల్గొనాలి.

– వాకిటి వాబయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మాగనూర్

పిడుగు పడి 30 కోళ్లు మృతి



గండీడ్: పిడుగు పడి నాటు కోళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని అసిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. సోమవారం సాయత్రం ఉరుములతో కూడిన వర్షంలో పడిన పిడుగుకు పాలమూరు అంజిలయ్య తన సొంత పొలంలో ఉన్న 30 నాటు కోళ్లు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో రూ.20వేలనష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పేద రైతునైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా కష్లాపూర్ చెందిన కావలికృష్ణయ్య లేగ దూడ పిడుగు పాటుకు గురై మృతి చెందింది.

మండల పరిషత్‌కు గ్రహణం వీడేనా?

- పాలకవర్గం గడువు ముగిసి నాలుగేళ్లు



మండల పరిషత్ కార్యాలయం

జడ్చర్ల టౌన్: మండల పరిషత్‌కు పట్టిన గ్రహణం ఈ ఏడాదైనా వీడేనా అన్న సందేహాలు ఆయా పార్టీల నాయకులు, పదవులు ఆశిస్తున్న నేతల్లో నెలకొన్నాయి. పాలకవర్గం గడువు ముగిసి నాలుగేళ్లు గడిచినా నేటికి ఎంపీటీసీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అధికారంలో ఉన్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతుండటంతో ఆశావాహుల్లో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. జడ్చర్ల మండల పరిషత్‌కు 2020 మే 5న అప్పటి పాలకవర్గం గడువు ముగిసింది. నాటి నుంచి నేటి వరకు వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. 2021 మార్చిలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. అయితే కరోనా ఉధృతం అవుతుందని అప్పట్లో కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు సూచనల మేరకు కమిషన్ ఎన్నికలు నిర్వహించకుండా వదిలేసింది. ఈ కారణంగా నాయకుల ఆశలు అడియాశలు అయ్యాయి. దీంతో నాలుగేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతూ వస్తుంది. మండలంలో ఎంపీటీసీల రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా కాలేదని, బీసీలకు తీరని అన్యాయం జరిగిందంటూ కొందరు కోర్టును ఆశ్రయించటంతో ఎన్నిక ముందుకు సాగకుండా ఉంది.

ఆది నుంచి ఆటంకాలే..

మండల పరిషత్‌కు ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. 2014 స్వరాష్ట్రంలో ఎంపీటీసీ ఎన్నికలు జరిగినప్పటికి కొందరు కోర్టును ఆశ్రయించటంతో సభ్యుల ప్రమాణస్వీకారం, పాలకవర్గం ఎన్నిక వాయిదా పడింది. కేసు వీగిపోవటంతో 2016 మే నెలలో కొత్త పాలకవర్గం కొలువు తీరింది. ఈ కారణంగా 2020 మే వరకు ఐదేళ్ల పూర్తికాలం పాలకవర్గం పరిపాలన సాగించింది. దీంతో రాష్ట్రమంతా 2019లో ఎంపీటీసీ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు కొలువు తీరినా జడ్చర్లలో మాత్రం ఎన్నికలు కాలేదు. గడువు తీరినా వివిధ కారణాలతో ఎన్నికలు జరగక అధికారుల పాలనకే పరిమితమైంది.

కోర్టును ఆశ్రయించిన బీసీలు

మండలంలో 15 ఎంపీటీసి స్థానాలు ఉన్నాయి. వీటిలో బీసీలకు కేవలం ఒక్క సీటు అది మహిళకు మాత్రమే కేటాయించారు. 14శాతం ప్రకారం ఎస్సీలకు 3, 6శాతం ప్రకారం ఎస్టీలకు 3 సీట్లు కేటాయిస్తు మిగిలిన 8 సీట్లు జనరల్‌గా కేటాయించారు. ఈ కారణంగా తమకు అన్యాయం జరిగిందంటూ బీసీలు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. 22.7శాతం రిజర్వేషన్ ప్రకారం 4 సీట్లు రావాల్సిందేనని బీసీవర్గాలు పట్టుబడుతున్నాయి. హైకోర్టులో కేసు విచారణకు అప్పటి ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. దీంతో కేసు కొనసాగుతూనే ఉంది. రిజర్వేషన్ల పంచాయతీని ప్రస్తుత ప్రభుత్వం తీరుస్తుందా అన్నది వేచి చూడాల్సిందే. రిజర్వేషన్లు మార్చకుంటే బీసీలు మరోసారి కోర్టును ఆశ్రయించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో మండల పరిషత్‌లకు ఎన్నికలు జరిగినా ఇక్కడ నిర్వహించే ఆస్కారం లేకుండా పోతుందన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే మండల పరిషత్‌కు పట్టిన గ్రహణం వీడుతుందా అన్న సందేహాలు పెరుగుతున్నాయి. ఎంపీపీగా ఎస్సీ మహిళకు అవకాశం వచ్చినప్పటికి రిజర్వేషన్‌ను అనుభవించే ఆస్కారం లేకుండా పోయిందని ఎస్సీ వర్గాలు వాపోతున్నారు.

వేదమంత్రాలతో మార్మోగిన లోకిరేవు



అలంకరణలో భద్రకాళి, వీరబద్రస్వామి



నవాబుపేట: వేదమంత్రాల ఘోషతో మండలంలోని లోకిరేవులో మార్మోగింది. ఈ సందర్భంగా వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేదమంత్ర పారాయణం, భద్రకాళి, వీరబద్రస్వామి వార్ల ప్రత్యేక అభిషేకాల కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు హారతులతో ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం మహా మంగళహారతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిస్తున్నట్లు దేవాలయ పూజారి లింగయ్యస్వామీ, నందీశ్వర్ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం..

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్‌లో సోమవారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. గ్రామం మొత్తం భక్త పారవశ్యంతో నిండిపోయింది.

బీరప్పస్వామి ఉత్సవాలు..



బీరప్ప ఉత్సవాలల్లో ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో సోమవారం బీరప్ప స్వామి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మద్దిగట్ల కుర్వ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కుర్వ గొల్లలు శరీరానికి పసుపు రాసుకొని, బోనాల ఊరేగింపు నిర్వహించారు.

సహకార సంస్థలను బలోపేతం చేస్తాం



జ్యోతిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సహకార సంస్థల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని యాదవ కమ్యూనిటీ భవన్‌లో సోమవారం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో గొర్రెల కోసం కట్టిన డీడీలు ఇప్పించామన్నారు. ఇంకా ఎవరికైనా రానిపక్షంలో వారి వివరాలు అందిస్తే ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. పూర్వం నుంచి గొర్రెల కాపరులుగా తమ కులవృత్తినే నమ్మి జీవనం సాగిస్తున్న కురుమ, యాదవులు ఇకపై వారి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. చదవాలనే ఆసక్తి గలవారిని చదివిస్తే వారి కాళ్లమీద వాళ్లు నిలబడి జీవితంలో స్థిరపడుతారన్నారు. ప్రభుత్వ రంగమే కాక ప్రైవేట్ రంగంలో కూడా ఎన్నో అవకాశాలు నైపుణ్యం ఉన్నవారికి లభిస్తున్నాయన్నారు. మీ సమస్యలు పరిష్కరించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల స్కీంలను తెచ్చేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షుడు శాంతన్నయాదవ్, బాలమణి యాదవ్, కృష్ణయ్య, డాక్టర్ అబ్దుల్ రషీద్, వెంకటేష్ యాదవ్, ఎల్లన్న యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, గోవర్ధన్ యాదవ్, సాయిలు, నర్సింహులు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరెడ్డికి అభినందనలు..

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ నుంచి తొలిసారిగా భారతహాకీ జట్టు తరపున ప్రాతినిథ్యం వహించేందుకు ఒలింపిక్ క్యాంప్‌కు వెళ్తున్న జ్యోతిరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. హాకీలో రాణించి తెలంగాణఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, చాముండేశ్వరినాథ్, రఘునందన్‌రావు, వంశీ, పాల్గొన్నారు.

శ్రీకాంత్ మృతికి కారకులను శిక్షించాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి మల్లికార్జున వైన్స్ ఘటనలో మృతి చెందిన శ్రీకాంత్‌యాదవ్‌పై దాడిచేసిన వారందరిపై కేసులు నమోదు చేయాలని ఆల్ ఇండియా యాదవ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాచా శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సోమవారం డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీకాంత్‌యాదవ్ కేసులో ప్రదాన నిందితులైన ఏ–10లో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీసీ ఫుటేజీలో దాడిలో ఆయన పాల్గొన్నాడని వెంటనే ఆయనపై కేసు నమోదు చేయాలని కోరారు. చందు యాదవ్, ప్రకాష్, మురళి, రాకేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భూ తగాదాలో 13మంది బైండోవర్

మహమ్మదాబాద్: మండలంలోని జూలపల్లిలో భూ తగాదాలో రెండు వర్గాలుగా కొందరు రైతులు గొడవ పడుతున్నారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం కూడా ఇరువర్గాలు కొట్టుకున్నారు. ఈ విషయమై పోలీసులు గ్రామానికి వెళ్లి వారికి నచ్చ చెప్పి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పలువురు పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుంటామని తెలిపారు. గ్రామంలో రైతులతో చర్చించి 13మందిని తహసీల్దార్ తిరుపతయ్య సమక్షంలో బైండోవర్ చేశారు. మళ్లీ గ్రామంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు చేయమని గ్రామస్తులు ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మహమ్మదాబాద్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఆదర్శంగా నిలవాలని మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. గ్రామంలో 10జీపీఏ సాధించిన పదోతరగతి విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్ల మనీందర్ యాదవ్, జశ్వంత్, గండీటి స్వామి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వారికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి హాజి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాన్ని గుర్తించిన పోలీసులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కాటవరం స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనలో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు గుర్తించి యాజమానికి సమాచారం చేరవేశారు. మృతుని ఆచూకీని కూడా పోలీసులు గుర్తించి సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సంబల్ జిల్లాకు చెందిన వసీంగా గుర్తించారు. లారీ క్లీనర్‌గా పని చేసే వసీం ఇక్కడ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అసంపూర్తిగా డెయిరీ కేంద్రం పనులు

నర్వ: మండలంలో పశుపోషకులను ప్రోత్సహించి పాల ఉత్పత్తిని పెంచేందుకు నిర్మాణం చేసిన డెయిరీ కేంద్రం పనులు కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కొన్నేళ్ల కిందట పనులను ప్రారంభించి నిధులు లేమితో అసంపూర్తిగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన చేపట్టిన ఈ పనులు అసంపూర్తిగా వదిలేశారని వాపోతున్నారు. రోడ్డు పనులు చేపట్టడంతో ఈ అసంపూర్తి కేంద్రం పూర్తిగా కూరుకుపోయింది. పాడి రైతులు పాల ఉత్పత్తులను ప్రైవేటుకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నామని, పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.